క్లుప్తంగా

జీరో అకౌంట్ ఖాతాలు

మల్హర్: మండలంలోని తాడిచర్ల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో జీరో అకౌంట్ ఖాతాలు తీయాడానికి అవకాశం ఉందని బ్యాంకు మేనేజర్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు(బుధవారం) జీరో అంకౌట్స్ తీస్తున్నట్లు వెల్లడించారు. రెండు పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డ్, పాన్ కార్డు లేదా ఫుడ్ సెక్యూరిటీ(రేషన్) కార్డు లేదా ఓటర్ కార్డుతో ఖాతా తెరవచ్చని తెలిపారు. గ్రామస్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు హుండీ లెక్కింపు

రేగొండ: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నేడు(బుధవారం) బుగులోని వేంకటేశ్వరస్వామి జాతర హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

రక్షణ చర్యలు చేపట్టాలి



వాజేడు: తుపాను ప్రభావిత జిల్లాల్లో ములుగు కూడా ఉన్నందున పరిస్థితులకు అనుగుణంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది రక్షణ చర్యలు చేపట్టాలని డీపీఓ వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో డీపీఓ మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తుపాను ప్రభావం పొంచి ఉన్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటి కప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఉన్నారు.

బీఆర్ఎస్ వైపే మండల ప్రజలు

పలిమెల: రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచిన పలిమెల మండల ప్రజలు మాత్రం బీఆర్ఎస్ వైపే నిలిచి మెజార్టీ ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జవ్వాజి తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికి ప్రజల వైపే నిలుస్తుందని, కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో అములుకు ప్రజలను చైతన్యం చేసి ప్రజలకు అండగా ఉండి పోరాటం చేస్తామన్నారు. కేసీఆర్, పుట్ట మధు నాయకత్వంలో మండలంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు ఎప్పటికి మరువన్నారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రజల తరుపున మండలంలోని సమస్యలపై ప్రభుత్వంతో పోరాడేందుకు సిద్ధంగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు లంగారి రవీందర్, సర్పంచ్ ఆలం సత్యనారాయణ, నాయకులు మడే సత్యనారాయణతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో రైతుల ఆందోళన



మంగపేట: తిమ్మంటపేట వద్ద కోతదశలో ఉన్న వరి పంట




వెంకటాపురం(కె): ధాన్యంపై కప్పిన పరదాపై వర్షపు నీరు

మంగపేట: మిచాంగ్ తుపాన్‌తో వరి సాగుచేసిన రైతుల్లో ఆందోళన నెలకొంది. కోతదశలో ఉన్న వరి పైరు నేల వారడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. చేతికి అందవచ్చిన పంట తుపాన్ దాటికి నేల పాలవుతుండంతో చేసేదేమీ లేక రైతులు విలవిల్లాడి పోతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 25 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. పంట కోతదశకు చేరడంతో గత 20 రోజుల నుంచి రైతులు వరికోతలు ప్రారంభించారు. దీంతో ఐకేపీ (సెర్ప్), రైతు సహకార సంఘం ఆధ్వర్యంలో ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను సైతం ప్రారభించారు. వరి కోసిన రైతులు కల్లాలతో పాటు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబెట్టి ఉంచారు. ఇప్పటి వరకు సుమారు 25 నుంచి 30 శాతం వరకు కోతలు పూర్తి కాగా తుపాన్ కారణంగా మంగళవారం మండలంలో వర్షాలు పడుతుండటంతో కల్లాల్లో ధాన్యం తడిసిపోకుండా కాపాడుకునేందుకు రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. తుపాన్‌తో మండలంలో మిర్చీ సాగు చేసిన రైతుల్లో సైతం తీవ్ర ఆందోళన నెలకొంది. ఒక పక్క పూత దశలో ఉన్న మిర్చీ పంటకు తామర పురుగు, పేను రావడం వర్షాల కారణంగా చెట్లు సైతం పడిపోయి తీరని నష్టం వటిల్లే ప్రమాదం ఉండటంతో రైతులు తల పట్టుకుంటున్నారు.

వెంకటాపురం(కె): మిచాంగ్ తుపాన్ ప్రభావంతో మండలంలో మంగళవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుంది. కాగా, వర్షాలకు పంటలు దెబ్బతినకుండా కాపాడుకునేందుకు అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. మండలంలో సూమారు పది వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్‌లో వరి పంటను సాగు చేశారు. అరుకాలం కష్ట పడి పండించిన వరి పంట చేతికి అందవచ్చే సమయంలో వర్షాలు కురుస్తుండటంతో వరి పంట కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ములుగు రూరల్: అకాల వర్షం కారణంగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురవడంతో కోతలు మొదలు పెట్టిన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. సాయంత్రం సమయంలో భారీ వర్షం కురువడంతో ధాన్యం కాపాడుకునేందుకు రైతులు నానాపాట్లు పడుతున్నారు. అధికారులు నియోజకవర్గ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేస్తున్నారు.

ఏటూరునాగారం: తుపాన్ వల్ల అకాల వర్షంతో ఏజెన్సీలోని ఏటూరునాగారం, కన్నాయిగూడెం మండలాల్లో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. రైతులు వేసిన వరి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. గోగుపల్లి, శివాపురం, రామన్నగూడెం, పస్రాపురం ప్రాంతాల్లో వరికోతలను మొదలు పెట్టారు. ఇంకా కల్లాల్లోనే వరి ధాన్యం ఉండడంతో బరకాలు పట్టుకొని ధాన్యం కుప్పలవద్దకు రైతులు పరుగులు తీస్తున్నారు.



మంగపేట: పరదాలతో కప్పిన ధాన్యం రాశులు

వాజేడు: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా చిరు జల్లులు పడుతున్నాయి. దీంతో రైతులు తమ పంటలను, పండించిన ధాన్యాన్ని ఎలా కాపాడాలో తెలియక అయోమయంలో పడ్డారు. ఉదయం నుంచి మిర్చి చేలల్లో కాలువలు తీస్తున్నారు. కోతలు కోసిన ధాన్యాన్ని రాశులుగా పోసిన రైతులు టార్పాలిన్ కవర్లను కప్పి భద్రం చేశారు.



మల్లూరులో నేల వాలిన వరి పంట



ఏటూరునాగారంలో కురుస్తున్న వర్షం



వాజేడులో..

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రఘుపతి

చిట్యాల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని మండల విద్యాశాఖ అధికారి కొడెపాక రఘుపతి అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో యూ డైస్ ప్లస్ పై ప్రధానోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో మౌలిక సదుపాయాలు సక్రమంగా ఉండే విధంగా చూసుకోవాలని కోరారు. విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులకు చక్కటి బోధన అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ కృష్ణ, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శ్రీరాం రఘుపతి, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్పీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నదానం



స్వామి వారికి నైవేద్యం తీసుకెళ్తున్న దాత, భక్తులు

కాటారం: మండల కేంద్రంలోని శ్రీ ఆనంద ధర్మ శాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో మహా అన్నదాన కార్యక్రమం కొనసాగుతుంది. మంగళవారం అయ్యప్ప మాలాధారణ భక్తులకు మండల బట్టల వర్తక సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకముందు ఆలయ ఆవరణలో గణపతిహోమం నిర్వహించారు. వేదమంత్రోచ్చరణల మధ్య స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నదాతలను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు అశోక్‌గుప్త, అధ్యక్షుడు బచ్చు ప్రకాశ్, ఉపాధ్యక్షుడు జక్కు మొగిలి, ఆలయ పురోహితులు భానుప్రసాద్, బట్టల వర్తక సంఘం నాయకులు పులి అశోక్, మద్ది మనోహర్, గురుస్వాములు, మాలాధారణ స్వాములు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న నాయకులు

టేకుమట్ల: ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని మంగళవారం సాయంత్రం ఏఐసీసీ ప్రకటించిన సందర్భంగా మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ టౌన్ అధ్యక్షుడు కొలుగూరి అనిల్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, టపాసులు పేల్చారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రతి అంశాన్ని తెలుసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిన్న



హాజరైన విద్యార్థులు

ఏటూరునాగారం: విద్యార్థులు ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని అందుకు పుస్తకాలతో పాటు సమాజాన్ని అధ్యయనం చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జే చిన్న సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని డిగ్రీ కళాశాల సమావేశపు మందిరంలో విద్యార్థులకు జిజ్ఞాసస్ స్టడీ ప్రాజెక్టుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమాజంలోని అన్ని విషయాలపై అవగాహన పెంపొందించుకోవాలని అప్పుడే మంచి స్టడీ ప్రాజెక్టును రూపొందించగలుగుతారని తెలిపారు. విద్యార్థులు ప్రాజెక్టును రూపొందించి సమయంలో సమస్యను ఎంపిక చేసుకోవాలని అలాగే లక్ష్యాలను నిర్దేశించుకుని సమాచారాన్ని సేకరించి క్రోడీకరణలతో విశ్లేషణ చేసి సత్య నిరూపణ చేయాలన్నారు. విద్యార్థుల స్టడీ ప్రాజెక్టు స్టేట్ లెవల్‌కు ఎంపిక అయితే ప్రథమ బహుమతిగా రూ.25వేలు, రెండవ బహుమతిగా రూ.18వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు గెలుచుకోవచ్చని తెలిపారు. జిజ్ఞాన కోఆర్డినేటర్ రమేష్, లెక్చరర్లు విజయలక్ష్మి, గన్‌సింగ్, రేణుకరెడ్డి, నవీన్, వెంకటయ్య, జ్యోతి, ఫాతిమా, సంపత్ పాల్గొన్నారు.

మళ్లీ మొదలైన బెల్ట్ షాపులు!

- పట్టించుకోని అధికారులు
- ఎలక్షన్ కోడ్‌తో నెల రోజులు ప్రశాంతంగా ఉన్న గ్రామాలు



మండలంలోని ఓ కిరాణం షాపులో నిల్వ చేసుకొని అమ్ముతున్న మద్యం

గోవిందరావుపేట: మండల కేంద్రంలో ఎలక్షన్ కోడ్ రద్దు అయిందో లేదో అప్పుడే మళ్లీ వాడ, వాడకు బెల్ట్ షాపులు పుట్ట గోడుగుల పుట్టుకోచ్చాయి. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున నెల రోజుల ముందు నుంచే అధికారులు బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపుతూ దొరికిన వారినిపై కేసులు నమోదు చేస్తూ, దొరికిన మద్యాన్ని సీజ్ చేశారు. అలాగే నిందితులను బైండోవర్ చేయడంతో ఒక్కసారిగా మండలంలోని బెల్ట్ షాపులు మూత పడ్డాయి. దీంతో మండలంలోని ప్రతి వాడలో ప్రజలు అందులో ముఖ్యంగా మహిళలు నెల రోజుల పాటు ప్రశాంతంగా ఉన్నారు. సోమవారం సాయంత్రం ఈసీ రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ ఎత్తైయడంతో ఒక్క రోజుల్లోనే మళ్లీ బెల్ట్ షాపులు మొదలయ్యాయి. 2023–25 సంవత్సరానికి డిసెంబర్ 1 నుంచి నూతన మద్యం పాలసీ అమలులోకి వచ్చింది. దీంతో మద్యం షాపులు దక్కించుకున్న వారు అధిక లాభం కోసం బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారు. వైన్‌షాపు నిర్వాహకులు బెల్ట్ షాపులకు మద్యంను విక్రయించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. కస్టమర్స్‌కు నేరుగా అమ్మితే ఎమ్మార్పీ వస్తుంది. అదే బెల్ట్ షాపుకి అమ్మితే ఎమ్మార్పీకి మించి అమ్మొచ్చని నిర్వాహకులు ఈ పనికి పాల్పడుతున్నారు. క్వాటర్ బాటిల్‌పై, బీరు బాటిల్‌పై అదనంగా రూ.20, ఫుల్ బాటిల్‌పై ఏకంగా రూ.80 అదనంగా బెల్ట్ షాపులకు అమ్ముతున్నారు. బెల్ట్ షాపుల వాళ్లు మరో రూ.20 అదనంగా కస్టమర్‌కి అమ్మడం వల్ల, మొత్తం మీద ఒక క్వాటర్, బీర్లపై రూ.40, ఫుల్ బాటిల్ పై ఏకంగా రూ.160 అదనంగా కస్టమర్లకి అమ్ముతున్నారు. గోవిందరావుపేట మండలంలో పేరుకే కిరాణం దుకాణాలు కానీ చేసేది మాత్రం మద్యం వ్యాపారం. మండలంలోని అన్ని గ్రామాలలో కలిపి 100కి పైగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయి అనడంలో అతిశయోక్తి లేదు. ఇప్పటికైనా బెల్ట్ షాపులపై ఉక్కుపాదం మోపకపోతే మండలంలో మరిన్ని బెల్ట్ షాపులు పుట్టుకచ్చి మద్యం మత్తులో గొడవలు పడుతూ అర్ధరాత్రి వరకు నానా రభస చేస్తారని మహిళలు వాపోతున్నారు. అధికారులు స్పందించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సుధాకర్

టేకుమట్ల: సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ క్రైంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో సైబర్ క్రైం, డయల్ 100, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెల్ ఫోన్‌లకు గుర్తు తెలియని వ్యక్తుల నుంచి పర్సనల్ లోన్ల పేరుతో మెసేజ్, ఫేక్ ఆప్‌లను పంపిస్తూ వ్యక్తిగత సమాచారాన్ని సైబర్ నేరగాళ్లు తీసుకుని మన ఖాతాల్లోని నగదును పూర్తిగా స్వాహా చేస్తారని అన్నారు. కావున గుర్తు తెలియని వ్యక్తులకు వ్యక్తిగత సమాచారాన్ని తెలుపరాదని, ఎలాంటి ఓటీపీలు చెప్పొద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి బ్యాంక్ ఖాతా నుంచి నగదును పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలతో పాటు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ రమేష్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్ళు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అభ్యుదయ కాలనీని పరిశీలిస్తున్న సీఐ

గోవిందరావుపేట: తుపాన్ తగ్గే వరకూ మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పస్రా సీఐ శంకర్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న వర్షానికి ముందు జాగ్రత్తగా పస్రా సీఐ శంకర్, ఎస్సై షేక్ మస్తాన్ గతంలో వరద ముంపునకు గురైనటువంటి అభ్యుదయ కాలనీ, ప్రాజెక్ట్ నగర్ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై మాట్లాడుతూ.. గత అనుభావల దృష్ట్యా వరద తాకిడి పెరుగుతే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచనలు చేశారు. అంతే కాకుండా ప్రజలు అందరూ తుపాను తగ్గే వరకు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా ప్రమాదం అనిపిస్తే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలని అన్నారు. యువకులు ఎవరూ ఈతకు, పట్టుటకు, వాగుల వద్దకు, చెరువుల వద్దకు వెళ్లవద్దని అన్నారు.

కార్యకర్తల కృషి గొప్పది

మొగుళ్లపల్లి: ఎమ్మెల్యేగా గండ్ర సత్యనారాయణరావు గెలుపులో మండలంలోని కార్యకర్తల కృషి గొప్పదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు క్యాతరాజు రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలంలో సత్యనారాయణరావుకు 4628 ఓట్ల మెజారిటీ ఇవ్వడంలో మండల నాయకుల పట్టుదల గొప్పదని రానున్న రోజుల్లో ఎమ్మెల్యేగా గండ్ర సత్యనారాయణరావు ఆధ్వర్యంలో మండలంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇచ్చిన హామీలను కచ్చితంగా ఆయన నెరవేరుస్తారని అన్నారు.

మండల ప్రజలకు కృతజ్ఞతలు

టేకుమట్ల: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సత్యనారాయణరావుకు అత్యధిక మెజార్టీ ఇచ్చిన మండల ప్రజలకు కృతజ్ఞతలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ఓటర్లకు బీఆర్ఎస్ అభ్యర్థి కోట్లాది నగదును కుమ్మరించినా లొంగకుండా ఓటుతో గుణపాఠం చెప్పారన్నారు. కాంగ్రెస్ అభ్యర్థిపై ఉన్న అభిమానంతో గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలని తెలిపారు.

సరిలేరు మీకెవ్వరూ!

- వృత్తి, సామాజిక రంగాల్లో ముందంజ
- ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్న పలువురు

టేకుమట్ల: నీవు నీ కోసం కాకుండా సమాజం కోసం బతుకు అని అన్నాడు ఒక కవి. అతని ఆలోచనలు ఎంతో మందికి ప్రేరణ. వ్యక్తిగత స్వలాభం కోసం కాకుండా ప్రస్తుత సమాజంలో ఎంతో మంది వృత్తి పరమైన రంగాల్లో, సామాజిక రంగాల్లో తమదైన ముద్ర వేస్తూ ముందుకు సాగుతూ సరిలేరు మీకెవ్వరూ అనే విధంగా సమాజంలో ముందుకు సాగుతున్నారు. కరోనా, వరదలాంటి అత్యంత భయంకర విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లేక్క చేయకుండా అందించిన వారి సేవలను ఇప్పటి వరకు ఎవరూ మరిచిపోలేరు. ప్రమాదవశాత్తు ఎంతో మంది ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఎంతో మందికి రక్తదాతలుగా నిలిచిన వారు ఎందరికో ఆదర్శం. అనాథలుగా రోడ్లపై జీవితాన్ని వెల్లదీస్తున్న వారిని చేరదీసి ట్రస్టుల ద్వారా చేయూతనందిస్తున్నారు. వారు కష్టపడి సంపాదించే దాంట్లో నుంచి కొంత మొత్తాన్ని కొంత మందికి వెచ్చిస్తూ కొంత మంది స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

కేఎస్ఆర్ ట్రస్టు ద్వారా..



స్టడీ మెటీరియల్ ఇస్తున్న రాంనర్సింహారెడ్డి(ఫైల్)

మొగుళ్లపల్లి మండలం ఆకినపల్లికి చెందిన అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తించిన కంటంగూర్ రాంనర్సింహారెడ్డి సామాజిక సేవా రంగాల్లో అతడి సోదరుడైన సురేష్‌రెడ్డి జ్ఞాపకార్థంగా కేఎస్ఆర్ ట్రస్టును ఏర్పాటు చేవారు. జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ, చలివేంద్రం, అన్నదానం, నిరుపేదలకు దుస్తుల పంపిణీ, క్రీడాకారులకు క్రీడా పరికరాల పంపిణీ వంటి ఎన్నో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

సీపీఆర్‌తో ప్రాణం నిలిపి..



అభినందన పత్రం అందుకుంటున్న కిరణ్‌సింగ్(ఫైల్)

గత సంవత్సరం మార్చిలో రేగొండ మండల కేంద్రంలో ద్విచక్ర వాహనం ఢీకొని పడిపోయిన వ్యక్తి అపస్మరణ స్థితికి చేరుకోగా బ్లూకోట్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కిరణ్‌సింగ్ బాధితుడికి సుమారు 30నిమిషాల పాటు సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడాడు. ఈ మేరకు అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎస్పీ సురేందర్‌రెడ్డి, కలెక్టర్ భవేష్‌మిశ్రా చేతుల మీదుగా అభినందన పత్రాన్ని అందుకున్నాడు.

నిరుపేదలకు బియ్యం పంపిణీ



బియ్యం అందజేస్తున్న చంద్రశేఖర్‌గౌడ్(ఫైల్)

టేకుమట్ల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న కొయ్యడ చంద్రశేఖర్‌గౌడ్ మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో నిరుపేదలను గుర్తించి వారికి బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఉద్యోగంలో సంపాదిస్తున్న కొంతలో నిరుపేదలకు సేవ చేస్తే అంతకు మించిన తృప్తి జీవితానికి ఇంకేం ఉంటుందని అతడు అంటున్నాడు.

67 సార్లు రక్తదానం



అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సతీష్‌రెడ్డి(ఫైల్)

చిట్యాల మండలంలోని జడల్‌పేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కామిడి సతీష్‌రెడ్డి ఇప్పటి వరకు 67సార్లు రక్తదానం చేసి జిల్లాలోనే అత్యధిక రక్తదానం చేసిన వ్యక్తుల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. 2015లో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారిలో సతీష్‌రెడ్డి ఎంపిక కాగా అప్పటి గవర్నర్ నరసింహన్ చేతుల మీదుగా అవార్డును సైతం అందుకున్నారు.

పిచ్చి మొక్కల తొలగింపు



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న కూలీలు

వాజేడు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో రహదారులకు ఇరువైపుల పిచ్చి చెట్లు పెరగి ప్రమాదకరంగా మారాయి. దీంతో ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధాహామీ కూలీలతో పిచ్చి మొక్కలను తొలగించారు.